# వెన్నెల్లో తాజ్‌మహల్

వాళ్లిద్దరూ ఈ మధ్యనే పెళ్లి చేసుకున్నారు.

వాళ్లిద్దరూ అంటే, వాళ్లకేం వూరూ పేరూ లేదా? అని మీరడగవచ్చు. వుండకేం? వుంటాయి కాని, మనకు వూళ్లతో ఏం పని? పేర్లతో ఏం పని? ఈ భారతదేశంలో, తెలుగు గడ్డ మీద వాళ్లిద్దరూ ఒక ఆడది, ఒక మగాడు.

ఆ మాత్రం చాలదా?

సరే! ఇటీవలనే వాళ్ళకు వివాహం అయిందని కదూ అనుకున్నాం. పెళ్లయితే ఇటీవలనే జరిగింది.కాని ప్రయత్నం మాత్రం పదేళ్ల నాటిది. అంటే, పదేళ్ల కిందటి వాళ్ళ పెళ్ళి ప్రయత్నం యీనాటికి కార్యరూపం దాల్చిందన్నమాట! దానికి కారణం వాళ్లది ప్రేమ వివాహంకావటమే. అంతేకాదు. ఆ ప్రేమ కూడా చాల పవిత్రమైందనే అనుకోవాలి. లేకుంటే ఒకరి కోసం ఒకరు పదేళ్లు వేచివుండిమరీ పెళ్లి చేసుకున్నారంటే సామాన్య విషయమా? అందులోనూ ఈ సమాజంలో.

వాళ్ళ పెళ్లి పదేళ్ల క్రితమె ఎందుకు జరగలేదని ఎవరైనా అడిగితే అతను సరైనసమాధానం చెప్పడు. ఏదో కుటుంబ నియంత్రణ సిద్ధాంతాలు వల్లించి దాటవేస్తాడు. పదేళ్లు ఆగటం ద్వారా ఈ దేశానికి రెండు విధాల సేవ చేశానంటాడు. ఒకటి ఏమిటంటే పదేళ్ల కాలంలో కనీసం పది మంది భారం యీ భూమ్మీద పడకుండా చూడటం. రెండోది పదేళ్లలో వాళ్లవయస్సుపెరిగింది కాబట్టి అసలు సంతానమే కలక్కపోవచ్చునంటాడు.

అతనిమాటలు సత్యదూరం అని అందరికీ తెల్సును. అసలు సత్యం ఏవిటంటే, సమాజం. ఈ సమాజం పడుగు పేకల్లా కులగోత్రాలతో అల్లుకు పోవటం వల్ల ఏదీ అతకలేదు. కులం మతం కుదిర్నా గోత్రం అతకలేదు. అంచేత వాళ్ళ పెళ్ళికి ఇరుపక్షాల అంగీకారమూ మృగ్యమైంది. ఈ సంక్లిష్ట సమాజంలో పెళ్ళి చేసుకోవటం

అనేది వాళ్ళ చేతుల్లో లేకపోయినా, పెళ్లంటూ జరిగితే వాళ్ళ మధ్యనే జరగాలనే నిర్ణయం తీసుకోవటం మాత్రం వాళ్ళ చేతుల్లోనే వుందిగా! అంచేత అలాంటి నిర్ణయం తీసుకుని, పదేళ్ళు అలా ఒకళ్ళ కోసం ఒకళ్ళు భావకవుల్లా కలలు కంటూ వుండిపోయేరు.

పదేళ్లు అంటే మాటలా? ఒక దశాబ్దం.

ఈ దశాబ్ద కాలంలో సమాజంలో అనేక మార్పులొచ్చేయి. వాళ్ళ కుటుంబాల్లో కూడా పెనుమార్పులు సంభవించేయి. అప్పుడు అడ్డు తగిలిన వారిలో కొందరు పోయేరు. మరి కొందరు పట్టింపులు లేనివారుగా మారిపోయేరు. అంచేత వారి వివాహానికి మార్గం సుగమం కావటానికి పదేళ్లు పట్టింది. ఈ పదేళ్ళ కాలంలో ఒకో ఏడూ గడిచే కొద్దీ వాళ్ళ ప్రేమ పట్టు ఒకో మెట్టు పెరిగిందేగాని, తరగలేదు. వాళ్లది అంతగాఢమైన ప్రేమ కాబట్టే పెళ్ళి కాగానే తాజ్‌మహల్ చూడాలని ఆమె పట్టుపట్టింది.

"వెన్నెల్లో తాజ్‌మహల్ చూడాలని వుందండీ'' అనడిగింది.

ఆమె కోరిక సముచితం కాదని అతని వుద్దేశం కాదు. ఒక కళాఖండంగా తాజ్‌మహల్ చూడవచ్చు. కాని ఆమె వుద్దేశం అది కానేకాదు.

"ఒక ప్రేమికుడి కన్నీరు కారి గడ్డకట్టిన కట్టడం'' అన్నదామె. "పవిత్ర ప్రేమకు చిహ్నమైన తాజ్‌మహల్ చూడకపోతే మన ప్రేమకు సార్థకత లేదు.''

ఇక్కడే బహుశ వాళ్ల అభిప్రాయాల్లో భిన్నత్వం కన్పించేది.

'తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరు?' అన్నది అతని ప్రశ్న.

"ఇరవై రెండేళ్లు రాత్రనక పగలనక ఇరవై వేల మంది పన్జేస్తే, కొన్ని వందల మంది మరణిస్తే వారి చెమట నెత్తురు కలిసి గడ్డకట్టి తాజ్‌మహల్‌గా రూపుగట్టింది'' అన్నాడు.

"ఏమో బాబూ నేను చూడాలి. తాజ్‌మహల్ని వెన్నెల్లోనే చూడాలి'' అన్నదామె గట్టిగా.

అతడు వద్దని అన్లేదు.

"దాన్ని కళాఖండంగానే చూడు, ప్రేమ చిహ్నంగా మాత్రం చూడకు'' అని హెచ్చరించేడు.

ఆమె చూసింది. తాజ్‌మహల్ని వెన్నెల్లోనే చూసింది. చూసి నిజంగానే చలించిపోయింది. తెల్లని వెన్నెల్లో పాలమీద మీగడ తేలుతున్నట్లు అనిపించిందామెకు. వెనుక గలగల పారే యమునా నది ఒడ్డున వెన్నెల దివ్వెలా పాలరాతి ముద్ద

తాజ్‌మహల్,చుట్టూ ప్రశాంత వాతావరణం- ఆమె నిజంగానే ఏవో తెలీని లోకాలలో తేలిపోయింది.

"అతని ప్రేమకు నోచుకున్న ఆమె నిజంగా ఎంత అదృష్టవంతురాలు! ఇరవై రెండేళ్ళు శ్రమించి ఆమె ప్రేమ చిహ్నాన్ని నిర్మించిన అతను నిజంగా ప్రేమైక జీవి. దాన్ని రూపకల్పన చేసిన శిల్పి ధన్యజీవి" అంది తన్మయత్వంలో.

ఆమె అభిప్రాయాలని జీర్ణించుకోలేక పోతున్నాడు అతను.

"అంత తన్మయత్వం చెందాల్సింది ఏమీ లేదిందులో. ప్రతి సుందర రూపం వెనుకా ఒక కఠోర సత్యం వుంటుంది" అన్నాడు.

అతని మాటలు ఆమెకు మింగుడు పడలేదు.

"ఏవిటా కఠోర సత్యం?" అనడిగింది.

"ఇందాక నువ్వన్నావే, ఆమె అదృష్టవంతురాలు.. అతను ప్రేమ జీవి... మరొకడు ధన్యజీవి.. అని, అవన్నీ శుద్ధ అబద్దాలు. బూర్జువా కవులు పనీ పాటా లేక వర్ణించిన పాఠాలు."

ఆమె మనస్సు చివుక్కుమంది. అభిమానంకూడా దెబ్బతిన్నదనే అనుకోవాలి. ఆ బూర్జువా కవులెవరో, వాళ్లు వర్ణించిన పాఠాలేవిటో ఆమెకు బొత్తిగా తెలీదు. ఆమెకు తెల్సిందల్లా పవిత్ర ప్రేమ గురించే. అంచేతనే ఆ మాటలు ఆమె గుండెల్లోంచి ఒచ్చేయి. ఆ కట్టడాన్ని చూసిన తర్వాత, ఆ వాతావరణాన్ని అనుభవించిన తర్వాత ఆమెకు అలా అనిపించింది. అవి ఆమె అనుభూతిద్వారా వెలువడిన మాటలు.

ఆమె మరేం మాట్లాడలేదు.

ఆమె చిన్నబోయిందని అతను గ్రహించేడు.

"నీ అనుభూతులు అబద్ధంకావు. అలా నీకు అనిపించకపోతే అసలు నీకు మనసే లేదన్న మాట! ఉంది కనుకనే అది స్పందించి నీ మాటల ద్వారా పలికింది" అన్నాడు.

"ఊ..." అంది స్వల్పంగా

ఆ శబ్దంలో ఆమె సంతృప్తి పడిందనే అర్థంలేదు. ఆ సుందర కట్టడం వెనుక వున్న కఠోర సత్యం ఏవిటో ఆమెకు చెప్పాల్సిన బాధ్యత అతని మీద వుందనే హెచ్చరిక వుంది.

"షాజహాన్‌కు ముంతాజ్‌మహల్ ఒక్కతే భార్య కాదు. ఎంతో మందిలో ఆమె ఒకతె. అందర్నీ నిరాదరణ చేసి ఆమెను మాత్రమే ప్రేమించినంత మాత్రాన ఆమె అదృష్టవంతురాలవుతుందా? తోటి స్త్రీల సౌభాగ్యాన్ని దోచుకున్నది మాత్రమే అవుతుంది. ఇక షాజహాన్ అంటావా. అతనికి అసలు ప్రేమించటమే తెలీదు. తను

వలచిన స్త్రీని అహోరాత్రులూ కొలవడమే ప్రేమ కాదు. ప్రేమ అనే మాటకు సువిశాలమైన అర్థం వుంది. మాతృప్రేమ, సోదర ప్రేమ, తోటి ప్రజల్ని ప్రేమించటం- ఇవన్నీ ప్రేమలోకి వస్తాయి. కాని, ఏదీ అతన్లో లేదు. రాజ్యం కోసం సోదరుల్ని హత్య చేసేడు. తన విలాసాల కోసం ప్రజల్ని హింసించేడు. తాజ్‌మహల్ నిర్మాణంలోనే ఎందరో సామాన్య ప్రజలు బలయిపోయారు. తనకి ఇష్టమైన తాజ్‌మహల్‌పై అందంగా అక్షరాలు చెక్కిన శిల్పుల్ని కూడా అతను కరుణించలేదు. కళ్లు అతి క్రూరాతి క్రూరంగా పీకేసి అంధుల్ని చేసేడు. ఇక అతను ప్రేమ జీవి ఎలా అవుతాడు?"

"తాజ్‌మహల్ కట్టడానికి రూపకల్పన చేసిన వాడని చెప్పుకుంటోన్న టర్కీ వాడు ఉస్తాద్ ఈసా కూడా ఎంత మాత్రం ధన్యజీవికాడు. పరమ దుఃఖజీవి."

"ఎలా?"

"ఈసా ఒక స్త్రీని ప్రేమించేడు. ఆరాధించేడు. అయితే ఆమె అకాల మృత్యువు వాత పడింది. ఆమెకు స్మృతి చిహ్నంగా ఒక కట్టడాన్ని నిర్మించాలని శ్రమించి దీనికి రూపకల్పన చేసేడు. అంత గొప్ప భవనాన్ని నిర్మించే తాహతు తనకి లేదు గనుక షాజహాన్ కోరిక మేరకు తాజ్‌మహల్ నిర్మించి తృప్తి పడ్డాడు. అయితే అతనికి మిగిలిందేవిటి? భవనం పూర్తి కాగానే ఈసా చేతులు రెండూ నరికించి వేసేడు షాజహాన్."

ఆమె కథంతా విని విస్తుపోయింది.

"షాజహాన్ అంత క్రూరుడా?" అంది

"రాజులంతా క్రూరులే. లేకుంటే వాళ్లు రాజ్యాలు ఎలా ఏలతారు. ప్రజల్ని బానిసలుగా ఎలా మలుస్తారు. అందులోనూ షాజహాన్ మరీ స్వార్థపరుడు. అతని స్వార్థంకోసం ఎలాంటి అఘాయిత్యం చేయటానికైనా వెనుకాడలేదు" అన్నాడు.

అతని మాటలు ఆమె మనసులోనే తాజ్‌మహల్ సుందర రూపాన్ని క్రమంగా తుడిచెయ్యటం మొదలెట్టేయి. కాని దాని నేపథ్యంలోని ప్రేమగాథని మాత్రం మర్చిపోలేక పోతోంది. ఎంచేతనంటే తమలాగే షాజహాన్‌కూ ముంతాజ్‌కూ అనుకున్నప్పుడు వివాహం జరగలేదు. తమకి కులగోత్రాలు అడ్డు తగిలినట్లే వాళ్లకీ రాచరికం తాలూకు అవాంతరాలు ఏవో వచ్చేయి. అందుకే వాళ్లంటే ఆమెకంత అభిమానం.

అతనన్నాడు-

"అనుకున్నప్పుడేవాళ్ల పెళ్లి జరక్కపోయినా జరిగే వరకూ ఆగలేక పోయేడు ఆ

ప్రణయ జీవి. ఈలోగా మరోపెళ్ళి చేసుకుని తరించేడు."

ఈ విపరీతపుటర్థాలు ఏవిటో ఆమెకు తెలీటం లేదు. అతనికున్నంత విమర్శనాత్మక విజ్ఞత తనకి లేకపోవచ్చును. అంతమాత్రంచేత చరిత్ర తెలీని అవివేకిమాత్రం కాదు. అలా అని ఆమె అతన్తో వాదనకి దిగలేదు.

"షాజహాన్ ఎలాంటి వాడైనా కానివ్వండి. ముంతాజ్ అంటేమాత్రం ప్రాణం ఇచ్చేవాడు. ఆమె లేకుండా యుద్ధానికికూడా ఒంటరిగా వెళ్లే వాడు కాదుట" అంది.

"అవును మరి. యుద్ధంలో మరెవరినైనా కైవసం చేసుకువస్తాడేమోనని ఆమె భయం."

"నిజం చెప్పాలంటే ముంతాజ్ అంటే షాజహాన్ ఎన్నడూ ప్రాణాలివ్వలేదు. అతని స్వార్థం కోసం తుచ్ఛమైన కోర్కెల కోసం ఆమె ప్రాణాలే బలైపోయేయి."

"ఎలా?" అని అడిగింది. ముంతాజ్ జీవిత విశేషాలు వినటం ఆమెకు చాలా సరదా. ఒక్క ముంతాజ్ కథే కాదు. అలాంటి ప్రేమ గాథల్ని ఎన్నైనా విని తరించగలదామె.

"ముంతాజ్ ఎంతమంది పిల్లల్ని కన్నదో తెలుసా?" అనడిగేడు.

"ఊహు"

"పద్నాలుగు మందిని. పాపం కాన్పు కాన్పుకూ ఆమె ఆరోగ్యం క్షీణిస్తూనే వుండేది. మరి సంతానం ఒద్దని రాజ వైద్యులు సలహా ఇస్తూనే వుండేవారు. కాని ఏం లాభం? అతని మోహానికి ఆమె బలైపోయింది."

"అంటే?"

"ఏముంది? ఆమె పద్నాలుగో బిడ్డని కని చనిపోయింది."

ఆమె గుండెల్లో ఏదో గుచ్చుకున్నట్లు అనిపించింది. అసంకల్పితంగా ఆమె నేత్రాలు ధారలు కట్టేయి. చాలాసేపు ఆమె మాట్లాడలేదు. తాజ్‌మహల్ వెనక వైపు ఫెన్సింగ్‌ను అనుకుని యమున వైపు చూస్తోంది.భూమాత కన్నీటి చాలులా యమున ప్రవహిస్తోంది.

ఆమె ఆకస్మాత్తుగా అన్నది.

"ఈ విషాద గాథ వినటానికేనా ఇంత దూరం వచ్చింది."

"కాదు.చరిత్రకందని సత్యాలు తెలుసుకునేందుకు"

"చరిత్రకి కూడా నిజాయితీ లేదన్నమాట! పదండిక పోదాం"

అతనిచేయి పట్టుకుని కిందికి నడిపించింది.

*(ఈనాడు, ఆదివారం, 23-1-1994)*